

లంకలకోడేరులో జెడ్‌పి ఛైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని తిల్లపూడి, దగ్గులూరు, ఎస్.చిక్కాల, లంకలకోడేరులో ఆదివారం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పర్యటించారు. ఇటీవలే కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్షించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో స్వీయ పరిశీలన చేసి సమగ్రంగా పంట నష్టం నివేదికను రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం లంకలకోడేరు మలుపులోని రైస్ మిల్లును సందర్శించి రైతులు పండించిన ధాన్యం కనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు నాయుడు, జెసిఎస్ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, దగ్గులూరు సర్పంచి విశ్వనాథం కనక భద్రం, పేరయ్య పాల్గొన్నారు.



కౌలు రైతుకు.. భరోసా కరువు..!

- సాగు ఇబ్బందులు, పంట నష్టాలతో అన్నదాత విలవిల
- వరి, మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులకు పాట్లే
- కౌలురైతులకు దక్కని ప్రభుత్వ సాయం
- బ్యాంకురుణాలు, పంటనష్టం సైతం భూయజమానుల ఖాతాల్లోకే
- దిక్కుతోచని స్థితిలో ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది కౌలురైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగు ఇబ్బందులు, వరుస పంట నష్టాలతో కౌలురైతులు విలవిల్లాడిపోతున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కకపోవడంతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పుల బాధతో నిత్యం నరకం అనుభవిస్తున్న పరిస్థితి నెలకొంది. బ్యాంకులు అందించే పంట రుణాలు, ప్రభుత్వం అందించే పంట సాయం, బీమా వంటివి సైతం సాగు చేసే కౌలురైతులకు అందడం లేదు. సాగుకు దూరంగా ఉంటున్న భూయజమాని ఖాతాల్లోకే ప్రభుత్వ సాయం 90 శాతం చేరిపోతుంది. జిల్లాలో ప్రధానమైన పంట సాగుచేసే వరి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారగా, మామిడిరైతులు సైతం తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లాలో దాదాపు 16 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా జిల్లా సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాలకు రూ.వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రణాళికలు రూపొందిస్తున్న కౌలురైతులకు ఒక్క శాతం రుణం కూడా అందని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో కౌలురైతులకు బ్యాంకుల నుంచి అందిన పంట రుణాలు దాదాపు రూ.50 కోట్లు మాత్రమే. పశ్చిమలోనూ కౌలురైతులకు పెద్దగా రుణాలివ్వని పరిస్థితి ఉంది. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. పంట దెబ్బతిన్నా తెచ్చిన అప్పులు వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సాయం అందడం లేదు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతుభరోసా సొమ్ము సైతం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందడం లేదు.

ప్రభుత్వానికి పట్టని కౌలురైతుల గోడు

కౌలురైతుల గోడు ఏ ప్రభుత్వానికీ పట్టడం లేదు. ఎన్నికల ముందు కౌలురైతులను ఆదుకుంటామని హామీలు గుప్పించడం మినహా ఆచరణలో మాత్రం ఏమీ లేకుండా పోతుంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలురైతుల కోసం తెచ్చిన చట్టం రైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతో కౌలుకార్డు ఇవ్వాలని నిబంధన పెట్టడంతో కౌలురైతులకు కౌలుకార్డు కూడా అందని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతియేటా ఖరీఫ్‌లో పెద్దఎత్తున పంటలు దెబ్బతింటున్నా కౌలురైతులకు మాత్రం సాయం అందడం లేదు. బీమా సైతం భూయజమాని ఖాతాల్లోకే వెళ్లిపోతుంది. గడిచిన రెండేళ్లుగా వరి సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. సంచుల్లేక, లారీలు సకాలంలో రాక ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు నరకం చూస్తున్నారు. ప్రస్తుత రబీలో ఒకపక్క వర్షాలు, మరోపక్క ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలివానలకు మామిడి కాయలు రాలిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మామిడి సాగులోనూ అత్యధికంగా కౌలురైతులే ఉన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితికి రైతులు చేరుకున్నారు. సాగు చేసే కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు కౌలురైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితులు దారుణంగా మారే ప్రమాదం కనిపిస్తోంది.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

గ్రంథాలయాల నిర్వహణ ద్వారా సేవా, విజ్ఞానాన్ని అందించడం అభినందనీయమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం బస్టాండ్ పక్కనున్న మీరా స్మారక గ్రంథాలయంలో నిర్మించిన సేవా విజ్ఞాన కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు, విద్యావంతులకు ఈ గ్రంథాలయం ద్వారా అందించే సేవ ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ గ్రంథాలయం, సేవా విజ్ఞాన కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు, విజ్ఞాన కేంద్రాల నిర్వహణ వల్ల విద్య, సాంస్కృతిక సముపార్జనకు ఉపయోగపడతాయన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజ్ఞాన కేంద్రాలు ప్రజలకు అనేక విధాలుగా సేవలందిస్తూ తోడ్పాటునందిస్తునాయన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహ్మద్ మీరా పేరు మీద గ్రంథాలయం ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, ఉద్దరాజు రామం ట్రస్ట్ ఛైర్మన్ మంతెన సీతారాం, అల్లూరి సీతారామ రాజు భగత్ సింగ్ సేవా కేంద్రం ఛైర్మన్ బి.బలరాం, నరసాపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు నల్లిమిల్లి జోసఫ్, జకెట్, అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రం నిర్వాహకులు బాపూశ్రీ మాట్లాడారు. సభకు మీరా గ్రంథాలయ, సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించగా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు వందన సమర్పణ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా మండల ప్రత్యేక అధికారులందరూ వారం రోజులపాటు మండలాల్లో ఉండి ధాన్యం కొనుగోలును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆదివారం మండల ప్రత్యేకాధికారులకు, మండల అధికారులకు జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేసి మాట్లాడరు. మండల ప్రత్యేక అధికారులు రైసు మిల్లుల వద్దకు రైతుల ధాన్యం తెస్తున్నారా, వేరే వారి ధాన్యం ఎవరైనా తెస్తున్నారా పర్యవేక్షించాలని సూచించారు. మండలంలోని తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి, ఎంపిడిఒ కూడా ధాన్యం కొనుగోలును పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా సాగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రైస్ మిల్లులో ఒక ఇఒపిఆర్‌డిని నియమించామని, అధికారి రైస్ మిల్లులోనే ఉండి ధాన్యం దిగుమతి చేసుకునేటప్పుడు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఆర్‌బికె వద్దా విఆర్ఒ, విఎఎ, పంచాయతీ సెక్రటరీలు, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సహకార శాఖ సిబ్బంది, ఇతర అధికారులను నియమించామని తెలిపారు. రైతులకు అవసరమైన గోనెసంచులు, వాహనాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాటిని పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 8121676653కి ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేసినట్లయితే తక్షణం పరిష్కరిస్తామన్నారు. రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లర్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



పోడూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రైతులకు ఇబ్బంది కలిగించిన 9 రైస్ మిల్లులను సీజ్ చేశామని తెలిపారు.

పోడూరు: ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా మండల ప్రత్యేక అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉంటూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని కవిటం రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ ధాన్యం అమ్మకానికి ఎంత మంది రైతులు వచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, తేమ శాతం చూసే యంత్రాన్ని, స్టాకును ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, పంట అంతా రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామని, నిర్ణీత సమయంలో ధాన్యం సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. ప్రత్యేకాధికారితోపాటు టీమ్‌లుగా తహశీల్దారు, ఎంపిడిఒ, వ్యవసాయ శాఖాధికారి ధాన్యం కొనుగోలును పర్యవేక్షించి నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆఫ్‌లైన్‌లో కొన్న ధాన్యాన్ని సాయంత్రం కల్లా ఆన్‌లైన్ చేయాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టే రైస్‌మిల్లర్లను ఉపేక్షించేది లేదని, తొమ్మిది రైస్‌మిల్లులను సీజ్ చేశామని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి వి.ఆదిశేషు, తహశీల్దారు ఆర్‌వి.కృష్ణారావు, వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండల ప్రత్యేక అధికారి, మండల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు భరోసానివ్వాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం మార్టేరులోని రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకసారి ట్రిప్ షీట్ జనరేట్ అయిన తర్వాత రైతులు ఎవరూ రైస్‌మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా కంట్రోల్ రూమ్ నెంబరు 8121676653కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. ఎక్కడా రోడ్ల పక్కన ధాన్యం ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేసి తరలించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రామస్వామి, తహశీల్దారు డి.అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జీ, ఇన్‌ఛార్జి ఎఒ ఆడబాల జ్యోషుల పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు..

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ హక్కు పరిరక్షణకు ప్రజలంతా అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీ మూర్తి అన్నారు. విప్లవ వీరుడు అల్లరి సీతారామరాజు వర్ధంతిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో భీమవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అడ్డవంతన వద్ద ఉన్న అల్లూరి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతామరామరాజు అని కొనియాడారు. నేడు పాలకులు అల్లూరి ఆశయాలను తుంగలోకి తొక్కుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకొనే విధంగా ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామ రాజు, జిల్లా కోనాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు రామకృష్ణంరాజు, ఏసుబాబు, స్వాతి, త్రిమూర్తులు, రవిచంద్ర కుమార్, సుధాకర్, వర్మిం రాజు పాల్గొన్నారు.



అల్లూరికి నివాళు లర్పిస్తున్న యుటిఎఫ్ జిల్లా జిల్లా నేతలు

12న కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి కూలీలు ఐక్యంగా ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేత కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపాధి పర్యటనలో భాగంగా ఆదివారం నవాబుపాలెంలో ఉపాధి పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుడివాడ ఏసు, కోనపో ఆశీర్వాదం, నూతంగి సూర్యారావు పాల్గొన్నారు

పోరాటాలకు నిలువెత్తు నిదర్శనం సావిత్రమ్మ

ప్రజాశక్తి - ఆకివీడు

శ్రామిక మహిళల పోరాటానికి సావిత్రమ్మ నిలువెత్తు నిదర్శనమని సిఐటియు సీనియర్ నాయకులు బి.సత్యనారాయణ అన్నారు. అమరజీవి మారుబోయిన సావిత్రమ్మ రెండో వర్ధంతి సభ ఆకివీడులో ఆదివారం నిర్వహించారు. అనంతరం సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు అధ్యక్షత వహించారు. సభలో సిఐటియు సీనియర్ నాయకులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ సామాన్య కార్మికురాలిగా కుటుంబ జీవనాన్ని ప్రారంభించిన సావిత్రమ్మ పోరాటాలకు చిరునామాగా, ధైర్యానికి మారుపేరుగా, తనను తాను చెక్కుకున్నారని, సావిత్రమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఆకివీడు కార్మిక ఉద్యమంలో సావిత్రమ్మ తనదైన పాత్ర పోషించారన్నారు. కష్టాల కొలిమిలో మగ్గిపోతున్న కార్మిక వర్గాన్ని ఆకివీడు ప్రాంతంలో 40 సంవత్సరాల క్రితం ఏకంచేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తీవ్ర నిర్బంధంలో అరెస్టులకు బెదరకుండా మారు వేషాలతో వెళ్లి జిల్లాలోని కార్మికులను సంఘటితం చేశారన్నారు. కార్మిక సమస్యలే కాకుండా మహిళా సమస్యలపై నిరంతరం కృషి చేశారన్నారు. ఈ సభలో సిఐటియు నాయకులు బొర్రా శీను, పి.పాండు రంగారావు, మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, జి.రవితేజ, బి.రాంబాబు మాట్లాడారు.



సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు



ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

మంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ధర్నా

తణుకురూరల్: అకాల వర్షాల తో నష్టపోయిన రైతుల పట్ల అవహేళనగా మాట్లాడిన మంత్రి కారుమూరి వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని సిపిఎం నాయకులు కామన మునిస్వామి, అడ్డగర్ల అజయకుమారి తెలిపారు. మంత్రి కారుమూరి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల పట్ల మంత్రి కారుమూరి మాట్లాడిన తీరును సిపిఎం ఖండిస్తోందన్నారు. వర్షాలకు ముందే ధాన్యం గట్టుకు చేర్చిన వారికి కూడా సంచులు ఇవ్వకపోవడం వల్లే వర్షం బారిన పడ్డారన్నారు. ఎంత డిజిటల్ వ్యవస్థ ఉన్నప్పటికీ రైతులకు ప్రభుత్వం ఎలాంటి మేలూ చేయలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. నేను ఉన్నాను, నేను విన్నాను అనడం కాదని ఆచరణలో చూపించాలని అన్నారు. రైతులను ఓదార్చడం మాని రెచ్చగొట్టేలా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. మంత్రి బాధ్యతగా మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పివి.ప్రతాప్, గార రంగారావు, వీర్రాజు, శివకుమార్, రామకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేన్నెలపై, ఒడ్డు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపక్తి భోజనాలు చేశారు.

ఏటిగట్టు సమస్యకు శాశ్వత పరిష్కారం

పనులకు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఏటుగట్టు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నామని, తీర ప్రాంత ప్రజల ధైర్యంగా, సంతోషంగా జీవనం సాగించవచ్చని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం నరసాపురం పురపాలక సంఘం పరిధి 4వ వార్డులో సుమారు రూ.27 కోట్లతో వరద తాకిడికి కోతకు గురవుతున్న ఏటిగట్టు అభివృద్ధి పనులకు ముదునూరి.ప్రసాదరాజు భూమిపూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వరద ప్రభావానికి ఏటిగట్టు కోతకు గురైందని, తీర ప్రాంత ప్రజలు భయంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తాత్కాలిక పరిష్కారం కోసం రూ.56 లక్షలతో 400 మీటర్లు కరకట్ట నిర్మించుకున్నామని తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం సుమారు రూ.27 కోట్లతో ఏటిగట్టు గోడను నిర్మించనున్నామని, భవిషత్తులో వరదలొచ్చినా తీర ప్రాంత ప్రజలు ధైర్యంగా తమ కార్యకలాపాలు సాగించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఉన్న స్లూయిస్‌ల మరమ్మతులకు రూ.8.25 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న జూన్, జులైలో వరదలొస్తే పనులకు ఆటంకం కలుగుతుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, బర్రి శంకరం, జెడ్‌పి బొక్క రాధాకృష్ణ, మొగల్తూరు జెడ్‌పి తిరుమాని బాపూజీ, పోలిశెట్టి గోపీనాథ్, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.



ముదునూరికి హారతి ఇస్తున్న మహిళ

గోనె సంచుల కొరత లేకుండా చూడాలి

కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన రైతుల నిరసన

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులకు గోనె సంచుల కొరత లేకుండా చూడాలని, తడి, పొడి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ పొలమూరులో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రహదారిపై రైతులు నిరసన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ మాట్లాడుతూ దాళ్వా పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి సహకరించ లేదన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. వాతావరణ ఇబ్బందులున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం కావాల్సి ఉన్నా ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణం ప్రభుత్వం రైతులకు బరకాలు, గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు గూడాల వెంకటేశ్వరరావు, సుంకర రామాంజనేయులు, కేతా శ్రీరామ్మూర్తి, పిల్లి సాయిబాబా, జనసేన గ్రామ అధ్యక్షులు తోరం వెంకన్నబాబు, జి.నరసింహ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు, కౌలు రైతులు


బి.గోపిక


ఎండి.ఫరిహా


కె.ప్రిస్కిల్లా

గౌతమి విద్యార్థుల విజయఢంకా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పది పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని గౌతమి స్కూల్ విద్యార్థులు విజయఢంకా మోగించారు. 600 మార్కులకు గాను బొడ్డు గోపిక 580 మార్కులు, మహ్మద్ ఫరిహా 574, కె.ప్రిస్కిల్లా 559, మేడిచర్ల సాహితీశ్రీ అమూల్య 558 మార్కులు సాధించి సంస్థకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. అతి తక్కువ ఫీజులతో గౌతమి పాఠశాల నడుస్తోందని గౌతమి విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి దుర్గాప్రసాద్ తెలిపారు. ఇంతటి విజయాలు సాధించిన విద్యార్థులకు సంస్థ తరుపున అభినందనలను తెలియజేస్తున్నానని తెలిపారు.


ఎం.సాహితీశ్రీ అమూల్య


కొండ శుభశ్రీ


పురోహిత్ ప్రసన్న


జి.వాత్సల్యా దేవి

ప్రతిభ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - మొగల్తూరు

పది పరీక్షల్లో మండల స్థాయిలో ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారని పాఠశాల ప్రిన్సిపల్ ఆకన రవిచంద్రన్ తెలిపారు. మండల స్థాయిలో 566 మార్కులతో ద్వితీయ స్థానంలో కొండా సుభశ్రీ, 564 మార్కులతో తృతీయ స్థానంలో పురోహిత్ ప్రసన్న, నాలుగో స్థానంలో 560 మార్కులతో జరుగు వాత్సల్యాదేవి నిలిచారని తెలిపారు. పరీక్షలకు 50 మంది హాజరుకాగా 40 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పది ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. దుర్గా వర్షిత 592 మార్కులు, అనిరుద్ 591 మార్కులు, గిరిరాజ్ శ్రీనివాస్ 591 మార్కులు, సంజని 591 మార్కులు సాధించారు. ఆర్తిశ్రీ 590, శిరీష 590, రూపశ్రీ 589 మార్కులు, లితిన్ 586 మార్కులు, విజిత 585 మార్కులు సాధించారు. 51 మంది 550లకు పైగా మార్కులు, 93 మంది 500లకు పైగా మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆదివారం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ ఎజిఎం వైఎన్ఎస్, పాఠశాల రీజియన్ ఇన్‌ఛార్జి పార్థసారథి, కో- ఆర్డినేటర్ రామారావు, ప్రిన్సిపల్స్ లక్ష్మి, భాషా, అకాడమిక్ డీన్స్ రమణ, డఫేదర్, ఇన్‌ఛార్జి సుధాకర్, చంద్రశేఖర్ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పదిలో ప్రథమ స్థానంలో దుర్గ

ప్రజాశక్తి - అత్తిలి

పది ఫలితాల్లో అత్తిలి హైస్కూల్ విద్యార్థిని నడపన దుర్గ 577 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న తెలిపారు. ఆరవల్లి హైస్కూల్ విద్యార్థిని కె.హేమశ్రీ 566 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. 564 మార్కులతో తృతీయ స్థానంలో బల్లిపాడు హైస్కూల్ విద్యార్థిని నిలిచిందని తెలిపారు. ఒరిఘేడు హైస్కూల్ పిండి పూజితకు 511 , ప్రభుత్వ హెచ్ఎస్ హైస్కూల్ గాది గణదుర్గ కుమారస్వామి, కంచుమర్రు హైస్కూల్ రోహిత్ 435 మార్కులు, మంచిలి హైస్కూల్ జి.లీలాదివ్య, కొమ్మర హైస్కూల్‌కు చెందిన సిహెచ్ లక్ష్మి 421 మార్కులు సాధించారు. జేమ్స్ క్రియేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డికెకె.కావ్యశ్రీ 579 మార్కులతో ప్రథమ స్థానంలో, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి వట్టికూటి రమ్య గాయత్రి 568 మార్కుల ద్వితీయస్థానం సాధించింది. మదర్ మిరిసిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి సత్తి రేష్మా 571 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

లంకలకోడేరులో ఎంఎల్ఎ నిమ్మల పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరులో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆదివారం పర్యటించి కల్లాల్లో ఉండిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం మారినా సరే రైతు ఇన్ని కష్టాలు చూడలేదన్నారు. ఈ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. తడిచిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గోనె సంచులు ఇవ్వకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట తెలుగు రైతు అధ్యక్షులు నెక్కంటి ఆదినారాయణ, కుడక కోటేశ్వరరావు, వేగేశ్న గోపాల కృష్ణంరాజు, మైలా బత్తుల మధు, పల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకురూరల్ : తడిచిన ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేసి, రైతుకు బస్తాకు రూ.1530లు ఇవ్వాలని టిడిపి మండల అధ్యక్షులు పితాని మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొమరవరంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను టిడిపి నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు కనీసం సంచులు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో మాదిరెడ్డి శ్రీరామ్, చంద్రమూర్తి, ముత్యాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.


హరిబాబును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఎంపిపి హరిబాబుకు సన్మానం

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజుకు (హరిబాబు) ఎంపిపి సంఘం రాష్ట్ర వైస్ ఛైర్మన్ పదవి రావడం పట్ల ఉండి ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంపిపి శ్రీహరి నారాయణరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఉండి మండల అధ్యక్షులు బొండాడ కేశవరావు, ఉండి సంఘం మాజీ అధ్యక్షులు తాడేపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ శ్రీహరి నారాయణరాజు చేయూతనివ్వడంలో ముందుంటారని, అటువంటి వ్యక్తికి రాష్ట్రస్థాయి పదవి రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ సహకారం కావాలన్నా తను సహకరిస్తానని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉండి ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు బొండాడ నారాయణరావు, సబిశెట్టి మురళీకృష్ణ, కోశాధికారి బొండాడ శివరామకృష్ణ, సభ్యులు బొండాడ సూర్య బ్రహ్మానందం, తాడేపల్లి శ్రీరామచంద్రమూర్తి, అప్పన నాగేశ్వరరావు, మండ భాస్కరరావు, తాడేపల్లి శ్రీనివాస్, కొర్లేపర జగదీష్, కొర్లేపర శ్రీనివాస్, పోనసానపల్లి మురళీకృష్ణ, బొండాడ సత్యనారాయణమూర్తి, బొండాడ సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాయి. శివదేవుని చిక్కాల జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 51 మంది ఉత్తీర్ణులయ్యారు. కడలి శ్రీలక్ష్మి 554 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూలు ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు తెలిపారు. లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 163 మంది విద్యార్థులు హాజరు కాగా 56 మంది ఉత్తీర్ణులయ్యారు. అందే జయశ్రీ 550, యుడిఎస్‌వికెఎస్ఎస్.తన్మయ్ 550 మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయులు జయ ప్రసాదరావు తెలిపారు. దిగమర్రు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు 75 మంది ఉత్తీర్ణులయ్యారు. అరట్ల కట్ట జిల్లా పరిషత్ స్కూల్ నుండి 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు. చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 32 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 66 మంది పరీక్షలు రాయగా 26 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. పూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28 మంది ఉత్తీర్ణులయ్యారు. వెలివెల ఉన్నత పాఠశాలలో 36 శాతం, ఆగర్తిపాలెం లూథరన్ హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఏ ఒక్కరూ పాస్ కాలేదు. ఉల్లంపర్రు మాంటిస్సోరీ హైస్కూల్ నుండి 87 మంది పరీక్ష రాయగా 82 మంది ఉత్తీర్ణత సాధించారు. 585 మార్కులతో షేక్ జావేద్ స్కూల్ టాపర్‌గా నిలిచారు.


కడలి శ్రీలక్ష్మి

పది ఫలితాల్లో బాలికలదే హవా

ప్రజాశక్తి - పాలకోడేరు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలు హవా కనబర్చారు. మండలంలోని 10 జెడ్‌పి ఉన్నత పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాలకు చెందిన మొత్తం 554 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా మొత్తం 288 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఇఒ రామలక్ష్మణమూర్తి శనివారం తెలిపారు. బాలురు 125 మంది, బాలికలు 163 మంది ఉత్తీర్ణులయ్యారు. విస్సాకోడేరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పి.లత నాగశ్రీ 567 మార్కులు, పెన్నాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన టిడిఎస్.శ్రీకర్ 566 మార్కులు, శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన డి.పవన్‌సాయి 551 మార్కులతో మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే పెన్నాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల 80 శాతం ఉత్తీర్ణతో మొదటి స్థానంలో, గొల్లలకోడేరు పాఠశాల 73 శాతం, వేంద్ర జెడ్‌పి ఉన్నత పాఠశాల 68 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కోరుకొల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి 17 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో ఇద్దరు బాలికలు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ఉత్తర్ణతలో 12 శాతంతో కోరుకొల్లు పాఠశాల చివరి స్థానంలో నిలిచింది.

ఆచంట మండలంలో 51 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఆచంట

పది పరీక్షా ఫలితాల్లో మండలంలో 51 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేటు పాఠశాలలకు సంబంధించి 524 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 267 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆచంట వేమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి టివివిఎన్‌డి.ప్రదీప్ 549 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాల చెందిన విశ్వనాథం దీపిక 548 మార్కులతో ద్వితీయ స్థానం, కొడమంచిలి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పెదపూడి సుప్రియ 541 తృతీయ స్థానంలో నిలిచినట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. ఆచంట ఉన్నత పాఠశాలకు చెందిన 133 మంది విద్యార్థులకు గాను 59 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆచంట వేమవరంలో 58 మంది విద్యార్థులకు 37 మంది ఉత్తీర్ణ సాధించారు. పెనుమంచిలిలో 25 మందికి ఐదుగురు, కొడమంచిలిలో 87 మందికి 19 మంది, కరుగోరు మిల్లులో 16 మందికి 10 మంది, ఎంపీపాలెం వల్లూరులో 90 మందికి 51 మంది, భీమలాపురంలో 49 మందికి 27 మంది, కోడేరులో 36 మందికి 13 మంది, హోలీ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొడమంచిలిలో 46 మందికి 42 మంది, ఆచంట స్మాక్ స్కూల్‌కు చెందిన నలుగురికి నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు.


టివివిఎన్‌డి.ప్రదీప్


విశ్వనాథం దీపిక


పెదపూడి సుప్రియ


ఎస్.వర్మ


జి.సిరి


కె.ప్రిస్కిల్లా

ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - యలమంచిలి

పది పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతంలో మండల వ్యాప్తంగా బాలికల హవా కనిపించింది. మండల వ్యాప్తంగా 11 ప్రభుత్వ హైస్కూళ్లు ఉన్నాయి. ఈ పరీక్షల్లో మొత్తం 579 మంది పరీక్షలు రాయగా వారిలో 111 మంది బాలురు, 156 మంది బాలికలు మొత్తం 267 మంది ఉత్తీర్ణత సాధించారు. 320 మంది ఫెయిల్ అయ్యారు. చించినాడ హైస్కూల్‌కు చెందిన ఎస్.హర్షిత్ వర్మ 563 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా, 559 మార్కులతో హైస్కూల్ విద్యార్థిని జి.సిరి ద్వితీయ స్థానంలో నిలిచింది. 551 మార్కులతో దొడ్డిపట్ల హైస్కూల్‌కు చెందిన గంగా దీపిక తృతీయ స్థానం సాధించింది.

మున్సిపల్ స్కూల్లో 40.75 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 6 మున్సిపల్ హైస్కూల్లో 528 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 230 మంది విద్యార్థులు 40.75 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. బివిఆర్ఎం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని ఆర్.నేహా తరంగిణి 574 మార్కులు సాధించింది. పట్టణంలో అత్యధికంగా 63 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన 63 మందిలో 18 మంది 500 మార్కులకుపైగా సాధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాఠశాల హెచ్ఎం వై.ప్రభాకరశాస్త్రిని అభినందించారు.


నేహ తరంగిణి

రైస్ మిల్లర్ల తీరు దారుణం


కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు అనుసరిస్తున్న తీరుతో కౌలు, పేద రైతులకు ముందు నుయ్యి వెనక గొయ్యి చందంగా ఉందని ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలంలోని పెనుమదం, పైడవ, గుమ్ములూరు, రావిపాడు, వద్దిపర్రు, కాంబొట్లపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క వాతావరణ మార్పులతో రైతులు నష్టపోతుంటే, మరో పక్క మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని తేమశాతం, ముక్కశాతం పేరుతో దోచుకుంటున్నారన్నారు. యథేచ్ఛగా దోపిడీ జరుగుతున్నా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదని విమర్శించారు. తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమశాతం, నూకశాతం పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి పంటలు పండిస్తున్న కౌలురైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట కౌలురైతులు గుడాల పెద్దిరాజు, బాలం లక్ష్మీనారాయణ, గుడాల అర్జునరావు, తొత్తరమూడి సత్యవతి, బొక్కా అనసూయ, గుడాల వెంకటేశ్వరరావు, అప్పారి వీరాంజనేయులు గుడాల వెంకటలక్ష్మి ఉన్నారు.


కీర్తి దీప్తి సత్యశ్రీ


సోనుకుమార్


జులేఖాకతున్

అమృతవాణి విజయఢంకా

తణుకురూరల్: పది పరీక్షా ఫలితాల్లో అమృతవాణి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ ప్రిన్సిపల్ టి.సత్యవాణి తెలిపారు. కీర్తి దీప్తి సత్యశ్రీ 563, మొల్ల జులేఖాకతున్ 512, రాజ్‌పురోహిత్ సోనుకుమార్ 489 మార్కులు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

ఇంజినీర్ అవ్వాలన్నదే లక్ష్యం

గణపవరం : భవిష్యత్తులో ఇంజినీరు అవ్వాలనే లక్ష్యంతో చదువుతున్నట్లు భావాయిపాలెం గ్రామానికి చెందిన అల్లూరి జయరమ్యశ్రీ చెప్పారు. గణపవరం విద్యాజ్యోతిమెరిట్ స్కూలు విద్యార్థి రమ్యశ్రీ పదో తరగతి పరీక్షల్లో 577 మార్కులు సాధించి స్కూల్ ప్రథమస్థానంలో నిలిచింది. తమది మధ్య తరగతి కుటుంబామని, తన తండ్రి శ్రీనివాసరాజు వ్యవసాయం చేస్తూ తనని చదివిస్తున్నారని తెలిపింది. తల్లి స్వాతి తన విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడంతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.



హోలి ఏంజెల్ స్కూల్ విద్యార్థుల సత్తా

ఆచంట : మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విలువలతో కూడిన విద్యను హోలీ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అందిస్తుందని సర్పంచి సుంకర సీతారామ్ అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హోలీ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన గుడాల గీత, కుడిపూడి ఏంజిల్స్, స్వాతికను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ బాలనాగు లక్ష్మీనరసింహరావు, వైసిపి నాయకులు పి.వనమరాజు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఎం నాయకులు పి.గోవిందు, పి.నరశింహమూర్తి తెలిపారు. సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కేశవరం, జల్లి కాకినాడలో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానికంగా ఉన్న సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. తెలుగు జాతి గర్వించదగ్గ పోరాట యోధుడు సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు గుత్తుల శ్రీను, నరాలశెట్టి రామకృష్ణ, ఎస్.సంజీవిరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు తెలిపారు. సీతారామరాజు వర్ధంతి సభ మండల కమిటీ ఆధ్వర్యంలో అద్దవరంలో నిర్వహించారు. కర్తిక శేఖర్ అధ్యక్షత వహించారు. సభలో నాగేశ్వరరావు మాట్లాడారు.

పెనుమంట్ర: సాయుధ పోరాటం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అల్లూరి సీతారామరాజు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నత్తా రామేశ్వరం సెంటర్‌లో ఆదివారం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి గోపాలన్ పూలమాల చేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నాయకులు విజయకుమార్, మేకా వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, పవన్, భవ్య, శ్రీరోహిత్ వెంకటశర్మ పాల్గొన్నారు.

ఆచంట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని వల్లూరు సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని వల్లూరులో నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి సర్పంచి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, ఉప సర్పంచి గద్దాడ శ్రీనివాసరావు, నాయకులు జోగు సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, సూర్యనారాయణ రాజు అప్పారావు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ కొడమంచిలి హైస్కూల్లోని అల్లూరి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం రవీంద్ర నాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిలుకూరి నరేంద్ర, పోలిశెట్టి వనమరాజు, రొక్కల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాళ్ల : అల్లూరి సీతారామరాజు ఆశయాలు, అనుసరించిన మార్గం నేటి తరానికి ఆదర్శనీయమని ఏలూరుపాడు మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు అన్నారు. మండలంలోని కోపల్లె, జక్కరం, మాలవానితిప్ప, కలవపూడి, ప్రాతళ్ళమెరక, జువ్వలపాలెం, కాళ్లకూరు, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పలువురు ఘన నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు ఆశయ సాధన కోసం స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా సెక్రటేరియట్ కమిటీ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. జువ్వలపాలెం గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, తిరుమాని శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని జిల్లా లయన్స్ క్లబ్ నూతన గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద బాలబొమ్మల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు.

పాలకొల్లు : అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని ప్రభుత్వమే గ్రామ స్థాయిలో స్కూళ్లలో చెప్పించాలని సిపిఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్ కోరారు. ఆదివారం అల్లూరి వర్ధంతి సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జవ్వాది శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజగోపాల్ మాట్లాడారు. అల్లూరి పోరాట స్ఫూర్తి నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

పాలకోడేరు : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశ భక్తి స్ఫూర్తిదాయకమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోగల్లులో జరిగిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకల్లో ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు వేర్వేరుగా పాల్గొని సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తణుకు రూరల్ : అల్లూరి స్ఫూర్తితో ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు కోసం పోరాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక అమరవీరుల భవనం వద్ద అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి, ఎస్.సత్యనారాయణ, కడలి వీర్రాజు, చిట్టూరి రంగారావు, టి.రామకృష్ణ, శ్రీహరి, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలి : అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మండల వ్యాప్తంగా డివైఎఫ్ఐ, ఐద్వా, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చించినాడ ఉయ్యాల స్తంభాల సెంటర్ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పివి.రమేష్‌కు పలువురి అభినందన

పాలకోడేరు : పెన్నాడ గ్రామంలోని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (బైట్) కళాశాల సలహా సంఘం సభ్యుడు, విఆర్ కన్సల్టెంట్ అధినేత పి.వి.రమేష్‌కు ఇటీవల భారత కంప్యూటర్ సమాఖ్య (హైదరాబాద్) 2023 ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేసింది. దక్షిణ భారత దేశంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు అసైన్‌మెర్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ తనిఖీ సలహాదారునిగా విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డు వచ్చింది. పెన్నాడ బైట్ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్, ఛైర్మన్ అడబాల వెంకటేశ్వరావు, సెక్రటరీ అడ్డాల శ్రీహరి, వైసఛైర్మన్ టివి.ప్రసాద్, సిబ్బంది ఆయనను అభినందించారు.

ఘనంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

పాలకొల్లు : పట్టణ పరిధిలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో పిఎంసి ఛైర్మన్ కొత్తల వెంకటకుమారి ఆధ్వర్యంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలకొల్లు పట్టణ సిఐ డి.రాంబాబు మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సానబోయిన ముత్యాలరావు, రూరల్ లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌వి.రంగారావ పాల్గొన్నారు.